కాళేశ్వరంతోనే సూర్యాపేట సస్యశ్యామలం

- వరి సాగు విస్తీర్ణం లెక్కలే తిరుగులేని సాక్ష్యం
- 2017కు ముందు 55 వేల ఎకరాలు దాటని వరి సాగు
- నేడు 2.58 లక్షల ఎకరాల్లో వరి సేద్యం
- జిల్లాకు వచ్చేది ఎస్సారెస్పీ నీళ్లయితే 2017కు ముందు ఇంత సాగేది?
- తప్పుడు లెక్కలు, కట్టుకథనాలతో విషప్రచారం

అర్వపల్లి మండలం బొల్లంపల్లి శివారులో కాళేశ్వరం జలాలతో సాగు చేసిన వరి

సూర్యాపేట, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లాలో దశాబ్దాల తరబడి పడావుబడిన గోదావరి ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తయిన తరువాతే సాగు కళ వచ్చింది. గత, ప్రస్తుత పంట విస్తీర్ణం లెక్కలే ఇందుకు నిదర్శనం. కాళేశ్వరం పూర్తి కాక ముందు 2017 యాసంగి వరకు జిల్లా పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టులో 55 వేల ఎకరాలకు మించి వరిసాగు కాలేదు. కాళేశ్వరం జలాల రాకతో 2.58 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఒకవేళ జిల్లాకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మాత్రమే గోదావరి జలాలు వస్తే 2017కు ముందు ఆయకట్టు 55 వేల ఎకరాలు మాత్రమే ఎందుకు ఉందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. కొంతమంది అధికారులు, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు లెక్కలు, కట్టు కథనాలతో జిల్లాకు ఎప్పటినుంచో శ్రీరాంసాగర్ జలాలే వస్తున్నాయని అబద్ధాలు ప్రచారం చేయడంపై రైతాంగం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో సూర్యాపేట జిల్లాలో 25 ఏండ్ల క్రితం ఎస్సారెస్పీ కాల్వలు తవ్వారు తప్ప నీళ్లు ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. అంతకుముందు ఎస్సారెస్పీ నీళ్లు వస్తే తెలంగాణ సాయుధ పోరాటయోధుడు బీఎన్ రెడ్డి చేసిన గోదావరి జలాల పోరాటం కూడా అబద్ధమేనా? అని ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో సూర్యాపేట జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ఉన్న హుజూర్‌నగర్ నియోజకవర్గంతోపాటు కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలోని మెజారిటీ మండలాల్లో సాగు అయ్యేది. గోదావరి ఆయకట్టు పరిధిలోని తుంగతుర్తి నియోజకర్గంతోపాటు సూర్యాపేట, కోదాడ నియోకవర్గాల పరిధిలోని దాదాపు రెండున్నర లక్షల ఎకరాల పరిధిలో ఒట్టిపోయిన చెరువులు, చుక్కనీరు అందించని బోర్లు, బావులతో నెర్రెలు బారిన నేలలు కనిపించేవి. దాదాపు 25 ఏండ్ల క్రితం గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వలు తవ్వినప్పటికీ నీళ్లు రాలేదు. కేవలం కాల్వలు కాదు, గోదావరి జలాలు తీసుకురావాలని నిరంతర ఉద్యమాలు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి గోదావరి జలాలు రాకముందే 2008లో కన్నుమూశారు. ఆ తరువాత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించడంతో ఎస్సారెస్పీ ఆయకట్టుకు జీవం వచ్చింది. 2017 యాసంగికి ముందు జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలో రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. బావులు, బోర్ల కింద 55 వేలకు మించి వరి సాగవలేదు. నేడు 2.58 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందుతున్నాయి. కాల్వల ద్వారా 2.13 లక్షల ఎకరాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన

ఈ యాసంగికీ కాళేశ్వరం జలాలు

ప్రస్తుత యాసంగి సీజన్‌కు కూడా జిల్లాలోని శ్రీరాంసాగర్ ఆయకట్టుకు కాళేశ్వరం జలాలే అందుతున్నాయి. నిరుడు కాళేశ్వరం నుంచి ఎల్ఎండీ వరకు, అక్కడి నుంచి బయ్యన్నవాగుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రస్తుతం బయ్యన్నవాగులో 0.39 టీఎంసీల నీరు ఉండగా, ఇప్పటికే తొలి విడత నీటి విడుదల పూర్తి కాగా రెండో విడత బుధవారం నుంచి ప్రారంభమైంది. రోజుకు 4 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేయడంతో నేరుగా పంట పొలాల్లోకి నీరు చేరుతున్నది. నిరుడు వానకాలం నీటి విడుదలతో జిల్లా పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలన్నీ నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. భూగర్భజలాలు పెరిగి 30 నుంచి 40 అడుగుల్లోనే నీళ్లు పుష్కలంగా లభ్యమవుతున్నాయి.

పంట పొలాల్లోకి 10 నుంచి 12 టీఎంసీల నీరు చేరుతున్నది. ఆయకట్టు పరిధిలో సుమారు 450 చెరువులు, కుంటలను 1.5 టీఎంసీలతో నింపడం ద్వారా మరో 45 వేల ఎకరాల స్థిరీకరణ జరిగింది. తుంగతుర్తి నియోజకవర్గంలో 92,456 ఎకరాలు, సూర్యాపేటలో 80,637, కోదాడలో 39,866 ఎకరాల ఆయకట్టు ఉండగా.. మిగిలిన ఆయకట్టు చెరువులు, కుంటల కింద ఉన్నది.

కాళేశ్వరం జలాలతో పెరిగిన సాగు విస్తీర్ణం

2016 నుంచి 2023 వరకు వరి సాగు విస్తీర్ణం గణాంకాలను పరిశీలిస్తే సూర్యాపేట జిల్లాకు శ్రీరాంసాగర్ నీళ్లు వస్తున్నాయా? కాళేశ్వరం జలాలు వస్తున్నాయా? అనేది అర్థమవుతుంది. జిల్లాలో 5,97,206 ఎకరాల సాగు భూమి ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి కాకముందు 2016లో 1,69,460 ఎకరాలు, 2017లో 1,69,185 ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాకు తొలిసారిగా 2018లో కాళేశ్వరం జలాలు రాగా ఏటేటా వరి సాగు విస్తీర్ణం పెరుగుతూ 2023లో 4,74,104 ఎకరాలకు చేరింది.నిజంగా శ్రీరాంసాగర్ జలాలే జిల్లాకు వచ్చి ఉంటే 2023 వానకాలం సాగుకు, 2016 సాగుకు ఇంత వ్యత్యాసం ఎందుకు ఉంటుంది?

సూర్యాపేట జిల్లాలో వరిసాగు విస్తీర్ణం ఇలా..(2018లో తొలిసారిగా కాళేశ్వరం జలాలు జిల్లాకు చేరాయి)

సంవత్సరం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
2016	1,69,460
2017	1,69,185
2018	2,35,580
2019	3,19,448
2020	4,01,580
2021	4,69,915
2023	4,74,104

తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కాళేశ్వరం జలాలు అందుతున్న మండలాలు

మండలం	ఎకరాలు
తుంగతుర్తి	24,102
తిరుమలగిరి	3,360
జాజిరెడ్డిగూడెం	15,967
నాగారం	13,625
నూతనకల్	19,213
మద్దిరాల	18,024
సూర్యాపేట	13,437
ఆత్మకూర్.ఎస్	29,938
చివ్వెంల	18,912
పెన్‌పహాడ్	13,562
మునగాల	12,416
మోతె	26,888
నడిగూడెం	3,492
గరిడేపల్లి	239

కాళేశ్వరం నీటితోనే పంటలు పండిస్తున్నాం

నాకు మూడెకరాల భూమి ఉన్నది. 30 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా. గతంలో ఎన్నడూ అరెకరం పండించింది లేదు. పంటలు పండక అప్పుల పాలయేవాళ్లం. కాల్వల్లో చుక్కనీరు వచ్చేది కాదు. కేసీఆర్ సర్కారు పుణ్యమాని కాళేశ్వరం నీటితో మూడెకరాలు పారుతున్నది. కాల్వల్లో నీళ్లు నిండుగా వస్తుండటంతో పంటలు బాగా పండుతున్నాయి. కాళేశ్వరం నీటితోనే మా పొలాలు పచ్చగా ఉన్నాయి. మూడెకరాలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. కాళేశ్వరం నీళ్లు తీసుకొచ్చిన కేసీఆర్ సారుకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

- బానోత్ స్వామి, రైతు, బీక్యాతండా, మోతె మండలం

కాళేశ్వరం నీటితో నాలుగెకరాలు సాగు చేస్తున్నా

శ్రీరాంసాగర్ 71 డిస్ట్రిబ్యూటరీ పక్కనే నాకు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. కానీ ఆ కాల్వలో నీళ్లు రాక వర్షాలే దిక్కయ్యేవి. ఎకరంలో మెట్ట పంట సాగు చేసే వాడిని. మిగతా మూడెకరాలు బీడు ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాల్వలు తవ్వారు తప్ప, నీళ్లు తేలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం నీళ్లు మొదలయ్యాయి. అప్పటి నుంచి మొత్తం నాలుగెకరాలు సాగు చేస్తున్నా. రెండు పంటలకు సరిపడా నీళ్లు వస్తున్నాయి. వడ్లు కూడా దండిగా పండుతున్నాయి. భూముల రేట్లు బాగా పెరిగాయి. ఇందతా కేసీఆర్ పుణ్యమే. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి నాలాంటి రైతులందరికీ మేలు చేసిండు.

- కడారి నరేశ్, రైతు, అర్వపల్లి

రంగనాయకసాగర్ సాక్షిగా కాళేశ్వరం నీళ్లు

1.10 లక్షల ఎకరాలకు ఇటీవల నీటిని విడుదల చేసిన మంత్రి సురేఖ

- గోదారమ్మ పరుగులు చూసి ఉమ్మడి మెదక్ ఇన్‌చార్జి మంత్రి ఆనందం
- కాళేశ్వరం దండుగన్న కాంగ్రెసోళ్లే.. ఆ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఇస్తున్నరు
- కేసీఆర్ భగీరథ ప్రయత్నంతో కాల్వల్లో పారుతున్న గోదావరి జలాలు
- నాలుగేండ్లుగా యాసంగికి సాగు నీరు.. ఫలితంగా బంగారు పంటలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో ఎట్టకేలకు ఈ యాసంగికి నీళ్లు

వేసవిలోనూ నీటితో కళకళలాడుతున్న రంగనాయకసాగర్ ప్రాజెక్టు

సిద్దిపేట, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు దండుగ అన్నరు.. ఒక్క ఎకరాకు సాగునీరు అందలేదన్నరు.. రైతులకు ప్రయోజనమే కలగలేదన్నరు.. తీరా ఇప్పుడు ఆ నీళ్లనే రైతుల పొలాల్లోకి పారిస్తున్నదీ కాంగ్రెస్ సర్కారు. ప్రాజెక్టు వృథా అని ఏ నోట అన్నారో, అదే నోట కాళేశ్వరం నీళ్లు ఇస్తున్నమని స్వయంగా ఒప్పుకొంటున్నరు. రిజర్వాయర్లలోని గోదావరి జలాలు, కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న గోదారమ్మను చూశాక కాంగ్రెస్ మంత్రులకు ఏం మాట్లాడాలో తెలియటం లేదు. సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల నుంచి కాల్వల ద్వారా చెరువులకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఇటీవల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బటన్ నొక్కి సాగు నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్లలో గోదావరి జలాలను చూసి మంత్రి ముఖంలో సంతోషం, ఉత్సాహం కనిపించాయి. కాళేశ్వర ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల రైతులకు ఊరట క లిగించే విషయమని, కొంత ఆలస్యమైనా రై తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నీటిని వి డుదల చేసినట్టు ఆమె చెప్పారు. రంగనాయక సాగర్ ద్వారా 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. మరి కాళేశ్వ రం ద్వారా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందటం లేదని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారి నోటితోనే రంగనాయక సాగర్ నుంచి 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని చెప్తున్నారు. వాస్తవాలు చూశాక వారి మనసు మార్చుకున్నారేమే అనిపిస్తున్నది.

కేసీఆర్ భగీరథ ప్రయత్నం

ఒకనాడు కరువుతో అల్లాడిన మెతకుసీమకు గోదావరి జలాల రాకతో రైతులు సంతోషంగా ఉన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రాత్రింబవళ్లు కష్టపడి, భగీరథ ప్రయత్నం చేసి ఉమ్మడి మెదక్ జిల్లాకు గోదావరి జలాలు తెచ్చారు. ఫలితంగా గడిచిన నాలుగేండ్ల నుంచి రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతున్నది. ఏ రైతును అడిగినా ఇదే విషయం చెప్తారు. చేసిన పనులు కండ్ల ముందట కనిపిస్తున్నాయి. ఏటా యాసంగి సాగుకు పుష్కలంగా గోదావరి జలాలను కేసీఆర్ ప్రభుత్వం అం దించి పంటలు ఎండిపోకుండా కాపాడింది. ఈ ఏడాది యాసంగి సాగు ప్రారంభమై నెల దాటినా రైతులకు సాగునీటిని విడుదల చేయకపోవటంతో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వయంగా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. మళ్లీ వారం, పది రోజుల తర్వాత మంత్రికి ఫోన్ చేసి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఉత్తరం కూడా రాశారు. దీంతో నీటిని విడుదల చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీ చేశారు. హరీశ్‌రావు చొరవతో ఎట్టకేలకు బుధవారం మంత్రి కొండా సురేఖ సాగునీటిని విడుదల చేశారు. హరీశ్‌రావు చొరవపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం కష్టపడిన నేత హరీశ్‌రావు అని, నీటి విడుదల సమయంలో లేకపోవటం తమకు బాధగా ఉన్నదని పలువురు రైతులు పేర్కొన్నారు. జిల్లాలో మరోవైపు అనధికార కరెంట్ కోతలు కొనసాగుతున్నాయి. దీంతో సాగుచేసిన పంటలు చేతికి వస్తాయా? లేదా? అన్న ఆందోళనలో రైతులున్నారు. గత యాసంగితో పోలి స్తే ఈసారి పంటల సాగు తగ్గినట్టు తెలుస్తున్నది.

తెలంగాణ జీవధార కాళేశ్వరం

మొదటిపేజీ తరువాయి...

ఏడువ అన్నట్టుగా తయారైంది. 112 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించి, 196 టీఎంసీలను వినియోగించుకొనేలా రూపకల్పన చేస్తే ప్రాజెక్టును ప్రారంభించేనాటికే ప్రధాన జలాశయం సామర్థ్యం 12 టీఎంసీలు తగ్గింది. కాలువలన్నీ పూర్తయ్యేసరికి మరో 10 టీఎంసీల సామర్థ్యం తగ్గింది. ఇక ఎస్సారెస్పీ స్టేజ్ 1లో అంటే ఎల్ఎండీకి ఎగువన అంటే ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ 0-146 కిలోమీటర్ల వరకు 4,62,920 ఎకరాలు, దిగువన అంటే కాకతీయ కెనాల్ 146-284 కిలోమీటర్ల వరకు 5,05,720 ఎకరాలు మొత్తంగా 9,68,640 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. అందులో 1/3 తరి, 2/3 మెట్టపంటలకు నీరిందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఉమ్మడి పాలనలో ఏనాడు కూడా స్టేజ్ 1లో మొత్తం ఆయకట్టులో రెండొంతుల ఆయకట్టుకు నీరందించిన దాఖలాల్లేవు. ప్రాజెక్టు చరిత్రలో వానకాలం, యాసంగి కలిపినా మొత్తంగా 9 లక్షలు దాటలేదంటే ప్రాజెక్టు దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. అప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో దిద్దుబాటుకు ఏవైనా చర్యలు చేపట్టారా? అంటే అదీ లేదు. పైగా మూలుగుతున్న నక్కపై తాటిపండు పడ్డట్టు ఉన్న ఆయకట్టుకే దిక్కులేని ఎస్సారెస్పీని ఆధారంగా చేసుకొని మరిన్ని ప్రాజెక్టులు చేపట్టారు. ఎస్సారెస్పీ మొదటి దశ ఆయకట్టుకే దిక్కులేదంటే 1984లో ఎస్సారెస్పీ రెండో దశకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. కాకతీయ కాలువను 284 కిలోమీటర్ల నుంచి 347 కిలోమీటరుకు విస్తరణ చేపట్టారు. ఆ తర్వాత అది మూసీలో కలుస్తుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండు పర్యాయయాలు 1996, 2002లో శంకుస్థాపన చేశారు. అయినా రాష్ట్ర ఏర్పాటు నాటికి పనులు పూర్తికాలేదు. మరోవైపు పూర్తయిన కాలువలు సైతం నీళ్లు ఇవ్వకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయి. అంతర్రాష్ట్ర ఒప్పందంలోని లోపంతో కాలువలు సిద్ధమయ్యే సమయానికి ఎగువన మహారాష్ట్ర బాబ్లీ సహా ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులు కట్టడంతో అసలు జలాశయంలోకి వరద రావడమే తగ్గింది. ఆ తర్వాత కాలువల నిర్వహణ లేక, నిర్మాణ లోపాలతో కాలువలన్నీ శిథిలావస్థకు చేరాయి. దీంతో అడపాదడపా వరద వచ్చిన కాలువల్లో నీళ్లు పారే పరిస్థితి లేక ప్రాజెక్టు కింద ఉన్న 14 లక్షల ఎకరాల ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టుతో కొత్త చరిత్ర

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రతిపాదిత లక్ష్యాన్ని నెరవేర్చడమే కాదు, ఆయకట్టుకు శాశ్వత భరోసాను కల్పించింది కాళేశ్వరం ప్రాజెక్టునే. శ్రీరాంసాగర్ నిల్వ సామర్థ్యం 112 నుంచి 90 టీఎంసీల దిగువకు తగ్గిపోవడంతోపాటు ఎగువన మహారాష్ట్ర నుంచి ప్రవాహాలు గణనీయంగా తగ్గిపోయాయి. గత 38 ఏండ్ల వరద పరిశీలిస్తే దాదాపు 25 ఏండ్లు (66 %) కరువు, 13 ఏండ్లు 34 శాతం మాత్రమే వరద వచ్చిందంటే ప్రాజెక్టు పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీటి ఢోకా లేకుండా ఉండేలా ఎస్సారెస్పీని నేడు సిద్ధంగా తీర్చిదిద్దారు. దాదాపు రూ.2వేల కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఎస్సారెస్పీకి తగినంత వరద రానిరోజుల్లో కాళేశ్వరంలో భాగంగా వరద కాలువ నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలించే ప్రాణహిత జలాల్ని పునర్జీవ పథకం ద్వారా వెనక్కి పంపింగ్ చేసి శ్రీరాంసాగర్ జలాశయంలో పోసేలా పథకాన్ని రూపొందించారు. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చే సమయానికి పునర్జీవ పథకాన్ని కూడా రెండు దశల ఎత్తిపోతలకు సిద్ధం చేశారు. దీంతో శ్రీరాంసాగర్‌పై భారం గణనీయంగా తగ్గనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగా ఎస్సారెస్పీ నేడు గత లక్ష్యాలను చేరుకోవడమేగాక, కొత్త చరిత్రను లిఖిస్తున్నది. వరదాయిని పేరును సార్థకం చేసుకొంటున్నది.

వరదకాలువకు, మిడ్‌మానేరుకు ప్రాణాధారం

వరద రావడం తగ్గిపోతున్నా ఎస్సారెస్పీపై 1990లో ఎస్సారెస్పీ వరద కాలువకు శ్రీకారం చుట్టారు. మొత్తంగా 22 టీఎంసీలతో 2,20,000ఎకరాలకు సాగునీరివ్వాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో మొదటగా ఎస్సారెస్పీ వద్ద ముప్కాల్ నుంచి హెడ్ రెగ్యులేటర్ ద్వారా వరదనీటిని 43.30 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా కోనరావుపేట పెద్దవాగుకు తరలించాలి. పెద్దవాగుపై కోరుట్ల వద్ద రిజర్వాయర్ నిర్మించాలి. అక్కడి నుంచి 66.45 కిలోమీటర్ల దూరంలో మాన్వాడ సమీపంలోని మిడ్‌మానేర్‌కు తరలించాలి. అక్కడ రిజర్వాయర్ నిర్మించాలి. మిడ్‌మానేరు నుంచి ఎత్తిపోతల ద్వారా 63.34 కిలోమీటర్ల దూరంలో గౌరవెల్లి గ్రామ సమీపాన సర్వీస్ రిజర్వాయర్‌కు తరలించాలి. గ్రావిటీ ద్వారా 125 కిలోమీటర్ల దూరంలో ఆలేరుకు తరలించాలి. నాటి పాలకులు వరద కాలువ తవ్వారు.. కానీ అన్నీ మరిచారు. ఎగువ నుంచి వరద వస్తే తప్ప ప్రాజెక్టుకు మనుగడ లేదు. తెలంగాణ ఏర్పడేనాటికి మధ్యమానేరు, తోటపల్లి, గౌరవెల్లి రిజర్వాయర్లకు శంకుస్థాపన చేసినా పనులు పూర్తి కాలేదు. ఇవీగాక తెలంగాణ ఏర్పడేనాటికి 44 ఏండ్లలో 28.48 శాతం మేరకు నీటి నిల్వసామర్థ్యం తగ్గిపోయి, మరోవైపు మహారాష్ట్ర బాబ్లీ, తదితర ప్రాజెక్టులు నిర్మించి గోదావరిని దిగ్బంధించడంతో వరద మార్గం మూసుకుపోయింది. దీంతో వరద ఆధారంగా నిర్మించిన వరద కాల్వ ప్రాజెక్టే ప్రశ్నార్థకంగా మారిన దుస్థితి. కానీ కాళేశ్వరం ప్రాజెక్టుతో వరద కాలువను అనుసంధానించడంతో అది ఇప్పుడు జీవధారగా మారింది.

ఎస్సారెస్పీ మొదటి దశ..

జిల్లా	ఆయకట్టు
1. నిజామాబాద్	34,945
2. జగిత్యాల	1,80,391
3. పెద్దపల్లి	1,06,811
4.కరీంనగర్	2,24,713
5. నిర్మల్	35,735
6. వరంగల్ (ఆర్)	1,32,044
7. వరంగల్(యూ)	45,304
8.జయశంకర్	82,746
9. మహబూబాబాద్	1,18,800
10.ఖమ్మం	7151
మొత్తం	9,68,640

సంవత్సరం వారీగా ఆయకట్టు వివరాలు..

ఎస్సారెస్పీ స్టేజ్-1

సంవత్సరం	వానాకాలం	యాసంగి	మొత్తం
2010-11	4,20,000	4,43,500	8,63,500
2011-12	4,20,232	4,59,000	8,79,232
2012-13	-	4,50,000	4,50,000
2013-14	4,04,657	4,80,000	8,84,658
2016-17	4,97,072	6,14,992	11,12,064
2017-18	-	3,47,435	3,47,435
2018-19	5,09,768	3,33,690	8,43,458
2019-20	1,26,881	7,97,700	9,24,581
2020-21	9,14,374	8,34,015	17,48,389 (2/3 ఎకరాలు మెట్టపంటల)
2021-22	7,99,163	6,83,330	14,82,493
2022-23	8,69,630	8,32,027	17,01,657

(ప్రతిపాదనలు)(2/3 ఎకరాలు వెట్ క్రాప్స్)

(నోట్: 2014-15, 2015-16 సంవత్సరాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టుకు నీరివ్వలేదు.)

ఎస్సారెస్పీ స్టేజ్ 2 ఆయకట్టు

ఉమ్మడి జిల్లా	ఆయకట్టు (ఎకరాలు)
వరంగల్	113578
ఖమ్మం	68914
నల్లగొండ	257508
మొత్తం	4,40,000

ఎస్సారెస్పీ స్టేజ్ 2

సంవత్సరం	వానాకాలం	యాసంగి	మొత్తం
2017-18	16,000	-	16,600
2018-19	17,000	-	17,000
2019-20	6,050	2.52,000	2,58,050
2020-21	3,64,000	2,85,000	6,90,000
2021-22	3,64,000	3,22,000	6,86,000
2022-23	3,84,000	3,45,096	7,29,096

తెలంగాణ నీటి నిల్వ సామర్థ్యం పెంపు ఇలా

రివర్ బేసిన్	2014నాటికి	కాళేశ్వరం ముందు (2014-18)	కాళేశ్వరం తరువాత 2022నాటికి	మొత్తం
గోదావరి	229.43 (టీఎంసీ)	38.52 (టీఎంసీ)	191.87 (టీఎంసీ)	459.82 (టీఎంసీ)

కాళేశ్వరం ప్రారంభించిన నాటి నుంచి రాష్ట్రంలో పెరుగుతున్న మత్స్య సంపద

సంవత్సరం	నీటి వనరులు	చేపలు	రొయ్యలు
2018-19	10,800	2.84 లక్షల మెట్రిక్ టన్నులు	9,998 మెట్రిక్ టన్నులు
2019-20	15,780	2.99లక్షలు	10,453 మెట్రిక్ టన్నులు
2020-21	17,774	3.49లక్షలు	11,273 మెట్రిక్ టన్నులు

నేడు కేసీఆర్ బర్త్ డే

- రాష్ట్రంతోపాటు ప్రపంచవ్యాప్తంగా పుట్టిన రోజు వేడుకలు
- రక్తదాన శిబిరాలు, గ్రీన్ ఇండియా చాలెంజ్
- వేడుకలకు సిద్ధమవుతున్న గులాబీ అధినేత అభిమానులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ఉద్యమ సారథి, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ శనివారం 70వ ఏట అడుగిడనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంతోపాటు ప్రపంచవ్యాప్తంగా సంబురాలు అంబారన్నంటనున్నాయి. గులాబీ దళపతి అభిమానులు, పార్టీ శ్రేణులు వేడుకలకు సిద్ధమవుతున్నారు. కేసీఆర్ జన్మదిన వేడుకలను ప్రపంచమంతా ఎన్నారైలు ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, అనాథలకు సహాయం ఎప్పటిలాగే చేస్తామని చెప్పారు. ఆస్ట్రేలియాలో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిడ్నీ, అడిలైడ్, మెల్బోర్న్, కాన్‌బెర్రా, బ్రిస్బేన్, గోల్డ్ కోస్ట్, బెండిగో, బల్లారాట్ నగరాల్లో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ఆస్ట్రేలియా నాయకుడు సాయిరాం ఉప్పు ఆధ్వర్యంలో మెల్బోర్న్‌లో వేడుకలు నిర్వహించగా, వినయ్‌గౌడ్ సన్నీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం చేపట్టారు. బ్రిస్బేన్‌లో విన్నీ తూముకుంట, సిడ్నీలో రవిశంకర్ దుపాటి, అడిలైడ్‌లో రవియాదవ్, కాన్‌బెర్రాలో రవి సాయల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉదయ్‌రెడ్డి, విశ్వామిత్ర మంత్రి పడగ, సునీల్‌రెడ్డి, శివ బిళ్ల, సుకుమార్ ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా, శనివారం కేక్ కటింగ్, పండ్ల పంపిణీ చేపట్టాలని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

ప్రజలకు 'గ్రీన్ ఇండియా చాలెంజ్'

కేసీఆర్ 70వ బర్త్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ (జీఐసీ) చైర్మన్, రాజ్యసభ ఎంపీ సంతోష్‌కుమార్ కోరారు. ఎక్స్ వేదికగా ఆయన ప్రజలకు శుక్రవారం పిలుపునిచ్చారు.

దత్తాత్రేయ శుభాకాంక్షలు

కేసీఆర్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉన్నదని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. కేసీఆర్ ఎలాంటి కఠిన పరిస్థితుల్లోనూ ధైర్యంగా ఉంటారని చెప్పారు. కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న డ్రైవర్లు, నేతలు

రేవంత్ తీరు మార్చుకో!

- మా ఆత్మహత్యలు కనిపించవా?
- గద్దెనెక్కాక హామీలు వదిలేస్తావా?
- ఆటోడ్రైవర్ల ఆగ్రహం.. రాష్ట్రబంద్ విజయవంతం
- జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 16: సీఎం రేవంత్‌రెడ్డీ నీ వైఖరి మార్చుకో.. డ్రైవరన్నల ఆత్మహత్యలపై స్పందించాలి.. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు చెల్లించాలి.. డౌన్ డౌన్ రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ నిరంకుశ విధానాలు నశించాలి.. అన్న నినాదాలు హోరెత్తాయి. శుక్రవారం రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్ కార్యక్రమంలో భాగంగా టీఏటీయూ, సీఐటీయూ, ఏఐటీసీ తదితర సంఘాలతో కూడిన ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ నగరంలో ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను డ్రైవర్లు దహనం చేశారు. ఆటోడ్రైవర్లను ఆదుకోండి.. అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదా లు చేశారు. అనంతరం ఒక్కసారిగా ఆటోడ్రైవర్లు రోడ్డుపై బైఠాయించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకు న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 మందికి పైగా డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నా సీఎం రేవంత్‌రెడ్డి కనికరించలేదని టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ బి కృష్ణమూర్తి, తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో సంపూర్ణంగా ఆటోల బంద్ జరిగింది. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద తమ కుటుంబ సభ్యులతో కలిసి డ్రైవర్లు ధర్నా చేశారు. నిజామాబాద్ నగరంలో ఆటోవాలాలు ఆటోలు నిలిపివేసి ర్యాలీలు నిర్వహించారు.

మహిళలకు నగదు ఇవ్వాలి: బోయినపల్లి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 16: మహిళలకు జీరో టికెట్‌కు బదులు వారి ప్రయాణానికి ప్రభుత్వం నగదు చెల్లించాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రభుత్వానికి సూచించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు చేపట్టిన బంద్‌కు మద్దతు పలికారు.